క్లుప్తంగా

యువత క్రీడల్లో రాణించాలి



యువతకు క్రీడా సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: యువత క్రీడాల్లో రాణించాలని మల్లాపూర్ కార్పొటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ తరపున యువతకు మల్లాపూర్ వార్డు కార్యాలయంలో క్రీడా సామగ్రిని ఆదివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడాల్లో రాణించాలన్నారు. క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్లు, టెన్నికాయిట్లు, చెస్ బోర్డులు, చెస్ కాయిన్స్, టెన్నిస్ బాల్స్ అందజేశారు. కార్యక్రమంలో పీఆర్.ప్రవీణ్, శాంతి యూత్‌క్లబ్ ప్రతినిధులు సూర్యనగర్ కాలనీ యూత్ సభ్యులు, కొల్లూరి రవి కిరణ్, రఘు, సాయిరెడ్డి, అఫ్రోజ్, శశి, వీరేశ్, శివరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేశవనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక



వేణుగోపాల్‌రెడ్డి

బోడుప్పల్: కేశవనగర్ కాలనీ సమావేశంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా యాస అనంత్‌రెడ్డి, అధ్యక్షుడిగా దాచి రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెలపాటి గోపాల్‌రెడ్డి, దర్మా బస్వారెడ్డి, నూనెముంతల వెంకటేశ్వర్లుగౌడ్, కుర్రెముల యాదగిరిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గంప నాగరాజు, కోశాధికారిగా పట్కారి రాజేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సర్వాయి పాపన్నకు నివాళి



హెచ్‌బీకాలనీలో సర్వాయి పాపన్నకు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నేత మునుగంటి రాంప్రదీప్ ముఖ్య అతిథులుగా హాజరై సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు ముత్యం వెంకన్నగౌడ్, మల్లేష్‌గౌడ్, దూసరి నవీన్‌గౌడ్, బాలయ్య, మొగిలిగౌడ్, సాయన్న మురారి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఫామ్ సండే..



కుషాయిగూడ: హెచ్‌బీకాలనీ, ఇందిరానగర్ క్రైస్ట్ సాల్వేషన్ సువార్త మందిరం వారు ఆదివారం ఫామ్ సండే (మట్టల ఆదివారం)ను ఘనంగా నిర్వహించారు. హెచ్‌బీకాలనీ వీధుల్లో చిన్నారులు మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ఫామ్ సండే వేడుకల్లో పాల్గొని చిన్నారుల్లో ఉత్సాహం నింపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



సాయితేజ(ఫైల్)

మల్కాజిగిరి: రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. ఓల్డ్ మీర్జాలగూడకు చెందిన సాయితేజ యాదవ్(23) ఓయూలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి స్నేహితుడి బైక్(కేటీఎం డ్యూక్) తీసుకొని బంధువుల ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్‌కు వెళ్లాడు. తెల్లవారుజామున ఇంటికి తిరిగి వస్తుండగా సాయిరాం థియేటర్ దాటిన తర్వాత బైక్‌కు కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సాయితేజ తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐపీఎల్.. ఫుల్‌జోష్..

అభిమానులతో కిక్కిరిసిన ఉప్పల్ వీధులు













ఉప్పల్: ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు అభిమానుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపాయి. అభిమాన క్రికెటర్లను స్వయంగా చూసే అవకాశం లభించడంతో పొంగిపోయారు. హైదరాబాద్ సన్ రైజర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఆదివారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌కు అభిమానులు పోటెత్తారు. మండే ఎండలను సైతం లెక్కచేయకుండా చంటి పిల్లలతో వచ్చి మరీ మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చారు. దీంతో ఉప్పల్, హబ్సిగూడ, రామంతాపూర్ వీధులన్నీ అభిమానుల కేరింతలో సందడిగా మారాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు క్యూకట్టారు. సందట్లో సడేమియాలా మెట్రో రైల్ పార్కింగ్ కాంట్రాక్టర్లు మ్యాచ్ సందర్భంగా అందిన కాడికి దోచుకున్నారు. ఉప్పల్–హబ్సిగూడలో నడక దారిని సైతం ఆక్రమించి పార్కింగ్ చేయించి అందిన కాడికి దండుకున్నారు. ఒక్కో వాహనం నుంచి రూ.100 వరకు దండుకున్నారని అభిమానులు ఆరోపించారు.





రోడ్లపై పాదయాత్రలు చేస్తే ఓట్లు పడవు

మంత్రి చామకూర మల్లారెడ్డి



తాగునీటి సరఫరా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: కాంగ్రెస్, బీజేపీ పార్టీల అధ్యక్షులు పాదయాత్రల పేరుతో రోడ్లపై తిరిగితే ప్రజలు ఓట్లు వేయరని, బీఆర్‌ఎస్ మాదిరిగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్‌లో ఆదివారం ఆయన కనకదుర్గ కాలనీ ఫేస్1, 2, 3, 4, 5లో అణుశక్తినగర్, శ్రీహరి ఎన్‌క్లేవ్, జై శ్రీరాంనగర్, కాలనీల్లో మిషన్ భగీరథ్ కింద చేపట్టి తాగునీటి సరఫరాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు రోడ్లపై తిరుగుతూ తాము చేపట్టిన పనుల్లో లోపాలను ఎత్తిచూపుతూ విమర్శలు చేస్తున్నారన్నారు. 10 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఎప్పుడైనా తాగునీరు ఇచ్చిందా..? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తాగునీరు, పింఛన్లు, ప్రజల బాధలు అర్థం చేసుకుని వారి సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, నేతలు కొత్త రవిగౌడ్, నర్సింహారెడ్డి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతోనే మళ్లీ అధికారంలోకి..



రాఘువేంద్రానగర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజవర్గ ప్రజలే నా బలగమని, కేసీఆర్ సంక్షేమ పథకాలే తిరిగి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తీసుకువస్తాయని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్ ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 8 ఏళ్ల పాలనలో దేశంలో ఏ రాష్ట్రంలో చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపాడన్నారు. ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, జనంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, అరిటి కాయల భాస్కర్, మేకల మధుసూదన్‌రెడ్డి, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతిరెడ్డి, చింతల నర్సింహారెడ్డి, జహంగీర్, సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు శ్రీకారం

రాఘువేంద్రానగర్‌లో రూ.10.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి డివిజన్‌ను పార్టీలకు అతీతంగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. చిలుకానగర్ డివిజన్ పరిధిలో రాఘువేంద్రనగర్‌లో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, బన్నాల ప్రవీణ్, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, నరేష్, కొండల్‌రెడ్డి, జగన్, ఫయాజ్, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభోత్సవం

కుషాయిగూడ: చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగపురం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, సెక్రటరీ రవీందర్‌రెడ్డి, శివరాములు, సోములు, శ్రీనివాస్‌గౌడ్, రాం మోహన్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఉపేందర్

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని వక్తలు శ్రీస్వామి బోదమయానంద, డాక్టర్ ఉపేందర్ అన్నారు. బోడుప్పల్ పల్లవి మోడల్ స్కూల్‌లో జరిగిన హైదరాబాద్ టుడే కాన్‌క్లేవ్ కార్యక్రమంలో నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ బాధ్యతలు, చేరుకోవాల్సిన గమ్యాలపై జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదవడం అంటే కేవలం పుస్తకాలు మాత్రమే కాదని, ఇతర పుస్తకాలను చదవడం వల్ల జ్ఞానంతోపాటు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. విద్యార్థులు శారీరక వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా తయారవుతారన్నారు. ప్రతిరోజూ నిద్రపోయే ముందు ఒక పుస్తకం చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ దేశాల్లో ఉండే విద్యావిధానాలను భారత దేశ విద్యావిధానాలను పోల్చిచూపిస్తూ ముచ్చటించారు. విద్య, ఆరోగ్యం, ధర్మం బాధ్యత కలిగిన వృత్తులను తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సులోచన, గీతాకృష్ణన్, కమల, అకాడమిక్ డైరెక్టర్ సుధ, పాఠశాల డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ తనూజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్ కాలనీ అసోసియేషన్ ఎన్నిక



శ్రీనివాసనగర్ కాలనీ సర్వసభ్య సమావేశం

కాప్రా: శ్రీనివాసనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతేడాది ఎన్నుకున్న కమిటీనే ఈ ఏడాది కూడా కొనసాగించాలని ఆదివారం సర్వసభ్య సమావేశం తీర్మానించింది. అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మోహన్, సాంబయ్య, ఉపేందర్‌చారి, జనరల్ సెక్రటరీగా సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా ఆనంద్, క్రిష్టారెడ్డి, పాండు, ట్రెజరర్‌గా ఓంప్రకాష్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నర్సింహాగౌడ్, నర్సింహారెడ్డి, సద్గురుచారి, ఎస్‌బీఎస్ కుమార్, రాఘవరం జిత్‌ను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీనివాసనగర్ కాలనీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి కుషాయిగూడ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌యాదవ్ పాల్గొని కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను కాలనీవాసులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం



కృష్ణారెడ్డినగర్ కార్యవర్గాన్ని సత్కరిస్తున్న మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: కాలనీవాసుల సంక్షేమంతో పాటు కాలనీ అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం అందజేస్తామని గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ కృష్ణారెడ్డినగర్ కాలనీ సంక్షేమసంఘం నూతన కార్యవర్గాన్ని వారు అభినందించారు. ఆదివారం వారిని సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, కమిటీ సభ్యులు విఠల్‌శ్రీ, రాములు, రమేష్, రాజేందర్, నాగరాజు, పద్మ, మంజుల, శంకర్, చంద్రశేఖర్, నగేష్, భిక్షపతి, మోతీరాం, సూరి పాల్గొన్నారు.

సిల్వర్‌వోక్ అసోసియేషన్ ప్రతినిధులకు సత్కారం..

చర్లపల్లి డివిజన్ సిల్వర్‌వోక్ బంగ్లాస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అభినందించారు. అధ్యక్షుడు గోపికృష్ణ చెన్నం, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, కోశాధికారి కె.టి.వి.ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఫణికుమార్‌ను సత్కరించారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



కరాటే పోటీల్లో పతకం, సర్టిఫికేట్స్ పొందిన విద్యార్థులు

బోడుప్పల్: గోవాలో జరిగిన అంతర్జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీల్లో విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు కరాటే కోచ్ లావణ్య వెల్లడించారు. బోడుప్పల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హీరో సుమన్ చేతులమీదుగా ఉత్తమ కోచ్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆర్‌ఎస్‌ఎస్‌కేఏఐ ఇండియా చీఫ్ నగేష్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అభినందించారు.

సన్మానం



అర్చకులు రాజశేఖర్‌ను సన్మానిస్తూ..

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీరాజరాజేశ్వరి సమేత వారణాసి విశ్వేశ్వర స్వామి దేవాలయం అర్చకులు రాజశేఖర్‌ను తెలంగాణ కళానిలయం సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఉగాది పురస్కారం పొందినందుకు శనివారం ఆలయంలో ఘనంగా సన్మానించారు. టి.మురళీధర్‌రావు, వి.వెంకటేష్, టి.రవీందర్, ఎస్.సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి



వరలక్ష్మీ(ఫైల్)

అల్వాల్: ఇంటి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ చంద్రబాబునగర్‌లో నివాసముండే ఏ.మణ్యం ఇంట్లో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కోడలు వరలక్ష్మీ(21) కరెంట్ షాక్‌కు గురైంది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నేరేడ్‌మెట్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మల్లాపూర్: నాచారం రాంరెడ్డినగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. రాంరెడ్డినగర్‌లో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు సీసీ రోడ్డు వేయాలని కోరుతూ ఆదివారం కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు.

డబ్బుల విషయంలో గొడవ.. స్నేహితుడి హత్య

ఉప్పల్: డబ్బుల విషయంలో గొడవపడి బీరు సీసాతో దాడిచేసి స్నేహితుడిని హత్య చేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవిందర్ రెడ్డి వివరాల ప్రకారం.. కాచిగూడ ప్రాంతానికి చెందిన నాయర్ సురేఖకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నిఖిల్(27) ఆటో డ్రైవర్. గతంలో రామంతాపూర్ పరిధిలోని కేసీఆర్‌నగర్‌లో ఉండేవారు. నిఖిల్ భార్య ఏడాది క్రితం మృతి చెందింది. నిఖిల్‌కు ఇద్దరు సంతానం. పిల్లలు నానమ్మ సురేఖ వద్ద ఉంటున్నారు. కాగా నిఖిల్ ఒక్కడే ఉప్పుగూడలో నివాసముంటున్నాడు. ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం నిఖిల్ స్నేహితుడు మహమ్మద్ సిరాజ్(21)తో కలిసి కేసీఆర్‌నగర్‌లో మద్యం సేవించారు. ఇదే క్రమంలో డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో ఆవేశానికి గురైన సిరాజ్ బీరు సీసా పగలగొట్టితో నిఖిల్ మెడపై విచక్షణ రహితంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి సురేఖ ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో సిరాజ్‌పై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సిరాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఇద్దరు యువకులపై పీడీ యాక్టు



కోరమట్టల శ్రీనివాస్



శ్రీకాంత్

మేడిపల్లి: మహిళలను అక్రమంగా రవాణా చేస్తూ వ్యభిచార వృత్తిలోకి దించుతున్న ఇద్దరు యువకులను మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపినా వారిలో మార్పు రాకపోవడంతో ఇద్దరు యువకులపై పీడీ యాక్టు ప్రయోగించి జైలుకు పంపిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నారాయణపురం ప్రాంతానికి చెందిన కోరమట్టల శ్రీనివాస్(27), పీర్జాదిగూడ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్(24)లు కొంత కాలంగా వెబ్‌సైట్ల ద్వారా యువతుల చిరునామాలను సేకరించి వ్యభిచారంలోకి దింపుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వీరిని పలుమార్లు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు. అయినా వారిలో మార్పు రాలేదు. దీంతో రాచకొండ కమిషనర్ వారిపై పీడీ యాక్టును ప్రయోగించి జైల్‌కు పంపారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం



రామంతాపూర్: పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మంగళవారం నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్న పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికే సీసీ కెమెరాలు ఉండగా వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పరీక్షలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచారు. స్కూళ్లలో ఫ్యాన్లు, లైట్లతో పాటు విద్యుత్ సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు జరిగే పది పరీక్షకు 34 పరీక్ష కేంద్రాల్లో 6,705 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు మండల విద్యాధికారి శశిధర్ తెలిపారు. రామంతాపూర్ పరిధిలో 8 కేంద్రాలు, ఉప్పల్‌లో 5, మల్లాపూర్‌లో 4, హబ్సిగూడలో 4, తిరుమలనగర్‌లో ఒక్కటి, నాగోల్‌లో 3, కొత్తపేటలో ఒకటి, మౌలాలిలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పటిష్ట బందోబస్తు మధ్య..

టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాలు లీకేజీపై జరుగుతున్న ఆందోళన దృష్ట్యా టెన్త్ ప్రశ్నపత్రాల్లో అలాంటి అస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పోలీస్ స్టేషన్లలో భద్రపర్చిన పదో తరగతి ప్రశ్నపత్రాలను పటిష్ఠ బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్‌ను అనుమతించరు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇందుకోసం ఆర్టీసీ ఇప్పటికే రూట్ మ్యాపింగ్ ప్రణాళికను తయారు చేసింది. విద్యార్థులు కూడా పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. హడావుడిగా పరీక్షా కేంద్రాలకు చేరుకోకుండా రవాణా సమయంలో జాగ్రత్తలు పాటించాలంటున్నారు. పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని పలువురు వ్యక్తిత్వ వికాస నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం వారికి ధైర్యం చెప్పి కేంద్రంలోకి పంపాలను అంటున్నారు.

ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీరిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రతి సబ్జెక్టులో స్పెషల్ క్లాసులు నిర్వహించాం. భయపడకుండా పరీక్షలు రాసే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించాం. కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకుంటాం. – శశిధర్, విద్యాధికారి, ఉప్పల్ మండలం.